
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మారుపేరు


ఇబ్రహీంపట్నంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మారుపేరని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో రూ.8.09 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ప్రజల పక్షాన ఉంటుందన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. మున్సిపాలిటీ లోని అన్ని కాలనీలల్లో అండర్ డ్రైనేజి, సిసి రోడ్లు వేస్తానని మున్సిపాలిటీ ప్రజలకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గురునాథ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్‌పర్సన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి చందు. వైస్ చైర్‌పర్సన్ బర్ల మంగ జగదీశ్వర్, కౌన్సిలర్లు నీళ్ళ బానుబాబు, నల్లబోలు మమతా శ్రీనివాస్ రెడ్డి, ఈర్లపల్లి సునీతా వెంకట్‌రెడ్డి, ఆకుల మమత ఆనంద్, పంది శంకరయ్య, మహ్మద్ సుల్తానా బేగం, ఇందిరాల రమేష్, కర్రే శశిధర్, మున్సిపాలిటీ కమిషనర్ రవీంద్ర సాగర్, డిఈ గుణాకర్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### ..ఆర్టీసిని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన ఆర్టీసి ఉద్యోగులు

**మేడ్చల్‌జిల్లా ప్రతినిధి, నవంబరు5, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్టీసికార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఆర్టీసిని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనంచేయాలని కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద టిజిఎస్ ఆర్టీసి జాయింట్ యాక్షన్ కమిటీ వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర టిజిఎస్ ఆర్టీసి సూచనల మేరకు మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా టిజిఎస్ ఆర్టీసి జాయింట్ యాక్షన్ కమిటీ వారు డిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద టిజిఎస్ ఆర్టీసి ఉద్యోగులు, కార్మికులు ఆందోళన వ్యక్తంచేసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్టీసి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు మహాలక్ష్మి ఆర్టీసి బస్సు పాసు కార్డులను ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. వివిధ కేటగిరిలలో ఉన్న ఆర్టీసి ఖాళీలను భర్తీ చేయాలని, ఆర్టీసికి కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా (టిజిఎస్ ఆర్టీసి) జెఎసి కన్వీనర్ గోపు శ్రీనివాస్, టిఎంయూ రాష్ట్ర కార్యదర్శి బిడి రావు, వివిధ డిపోల ఆర్టీసి కార్మిక జెఎసి నాయకులు కె.లక్ష్మయ్య, జి.రమేశ్, నిరంజన్, నాగమణి, భాగ్యలక్ష్మి, వినోద, మంగు, వెంకట్రావు, కెపి రావు, అంజయ్య, నాగార్జున, జిల్లాలోని డిపోల జెఎసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లపోచంపల్లిలో సదర్ ఉత్సవాలు

### పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి


గుండ్లపోచంపల్లిలోని నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, నవంబర్ 5. ప్రభాతవార్త:** యాదవులు కలిసికట్టుగా సదర్ ఉత్సవాలు జరుపుకోవడం శుభపరిణామమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజక వర్గ పరిధిలోని గుండ్లపోచంపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవులను పూజించే యాదవులు ఐకమత్యంతో రాజకీయాలకు అతీతంగా జరుపుకుంటున్న ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయని అన్నారు. గ్రేటర్‌లో విలీనం కానున్న గుండ్లపోచంపల్లి భవిష్యత్‌లో మరింత అభివృద్ధి కానుందని, అభివృద్ధికి నాయకులందరూ కృషి చేయాలని, తనవంతు సహకారం కూడా ఉంటుందన్నారు. రాజకీయలకతీతంగా యాదవులంతా కలిసి ఉత్సవాలను జరుపుకుంటుంటే సంతోషంగా ఉందని, స్థానికయాదవుల కోరికమేరకు యాదవ సంఘం నూతనభవనం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ప్రజలంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రీజినల్ రింగ్ రైల్ లైడార్ సర్వే పనులు

### కొడంగల్‌కు చేరుకున్న ప్రత్యేక హెలిక్యాప్టర్


లైడార్ సర్వే కోసం కొడంగల్‌కు చేరుకున్న ప్రత్యేక హెలిక్యాప్టర్

**కొడంగల్, నవంబర్ 5ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడు తున్న రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) పనులకు అడుగులు ముందుకు పడుతున్నాయి. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా నిర్మించే రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టు కోసం లైడార్ సర్వే పనులు ప్రారంభించారు. లైడార్ సర్వే నిమిత్తం వినియోగించే ప్రత్యేక హెలిక్యాప్టర్ మంగళవారం కొడంగల్‌కు చేరుకుంది. కొడంగల్ కేంద్రంగా మూడు రోజుల పాటు సర్వే చేపట్టనున్నట్లు ఆర్‌వి అసోసియేట్స్ ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు. సుమారు 564 కిలోమీటర్ల పరిధిలో రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు సమాచారం. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట్, గజ్వేల్, భువనగిరి, యాదాద్రి, చిట్యాల నారాయణపూర్, షాద్‌నగర్, షాబాద్ తదితర ప్రాంతాలను కలుపుతూ ఈ ప్రాజెక్టు నిర్మించనున్నట్లు సమాచారం.

## ప్రమాదకరంగా శిథిల భవనం...!

### -ప్రమాదం జరిగితేనే కూల్చుతారా..?

**దౌల్తాబాద్, నవంబర్ 05 ప్రభాతవార్త;**

కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో గ్రామపంచాయితి సమీపంలో ఉన్నటువంటి మినరల్ వాటర్‌ప్లాంట్ చెడిపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా మూతపడింది. మినరల్ వాటర్‌ప్లాంట్ ఉన్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో ఆ భవనం ఎప్పుడు కూలిపోయి ఎవరిపై పడుతుందో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనం గ్రామ పంచాయితి, హనుమాన్ టెంపుల్ సమీపంలో ఉండటం వలన చిన్న పిల్లలు అక్కడే ఆడుకోవడం గాని, గ్రామస్తులు ఉదయం సాయంత్రం వేళ అక్కడే సేద తీర్చుకోవడం గానీ చేస్తుంటారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చాలని గ్రామసభల్లో గ్రామస్థులు ఎన్నిసార్లు తీర్మానం చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సమగ్రంగా కుటుంబ సర్వేకు సహకరించాలి

### -సర్వేకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం -జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**మహేశ్వరం, నవంబర్ 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ సమగ్ర సర్వేకు జిల్లా ప్రజలు, అధికారులు సహకరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. కుటుంబ సమగ్ర వివరాలు చెబితే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు రావని అపోహలు పెట్టుకోవద్దని అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో సమావేశ మందిరంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లా వ్యాప్తంగా సమగ్ర సర్వేకు యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. నేటి నుండి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 5344 మంది ఎన్యూమనేటర్స్ సర్వేలో పాల్గొంటారని, 10 మంది ఎన్యూమరేటర్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి, జిల్లా స్థాయిలో ఎప్పటికప్పుడు డేటా సేకరించటం, పర్యవేక్షణ ఉంటుందన్నారు. సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, సమగ్ర సర్వేకు రాజకీయాలకతీతంగా ప్రజలు, రాజకీయ నాయకులు అందరూ సహకరించాలని తెలిపారు. సమాచారం నమోదు చేసుకునే ఎన్యూమరేటర్లు జాగ్రత్తగా వివరాలు సేకరించి, వారికి ఇచ్చిన ఫార్మట్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో సందేహాలుంటే పై అధికారులకు తెలిపి, పరిష్కరించుకుని ముందుకు వెళ్ళాలన్నారు. బుధవారం నుండి మూడు రోజుల పాటు ఇళ్ల వివరాల జాబితాను ఎన్యూమరేటర్లు సేకరిస్తారన్నారు. 15 రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి ఇచ్చిన ఫార్మట్ ప్రకారంగా కుటుంబంలోని వారి వివరాలను సేకరించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. జిల్లా స్థాయిలో స్పెషల్ అధికారిని నియమించడంతో పాటు, జిల్లా స్థాయిలో సర్వే మానిటరింగ్ కోర్ కమిటీని ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 6 లక్షల 57 వేల కుటుంబాలను ఎన్యూమరేటర్లందరూ సర్వే చేయడం జరుగుతుందన్నారు. సర్వే ద్వారా కుటుంబ స్థితి గతులు, ప్రభుత్వం నుండి అందుతున్న పథకాల వివరాలు సేకరించడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఛీఫ్ ప్లానింగ్ అధికారి సౌమ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సి.వెంకటేశం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం

### తపస్ ఉపాధ్యాయుల ధర్మాగ్రహ దీక్ష


తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్మాగ్రహదీక్షలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయ నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 5, ప్రభాతవార్త** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఉద్యమం చేపట్టిందని తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద తపస్ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష కార్యక్రమం జరిగింది. పెండింగ్‌లో ఉన్న డిఎ, పిఆర్‌సి, పెండింగ్ బిల్లులను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఉద్యమాన్ని తపస్ చేపడుతుందన్నారు. ఈ విషయంపై తపస్ నాయకులు అక్టోబరు 22న పాఠశాల స్థాయిలో, 28మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలు తెలిపి తహసీల్దార్‌కు ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాలను అందజేశామన్నారు. 5న జిల్లా స్థాయిలో కలెక్టరేట్ ముందు తపస్ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని జరుపుకోవటం జరిగిందని రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ముందు ధర్మాగ్రహదీక్షలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న తరువాత కూడా ఒకటవ తారీఖు జీతాలు తప్ప ఎటువంటి ఆర్థిక సమస్యల పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి పదినెలలు పూర్తి అవుతున్నా 4డిఏలు ప్రకటించి కేవలం ఒక డిఏను మంజూరు చేయటం కంటి తుడుపు చర్యగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 4డిఏలు ఇవ్వాలని, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, కుబేర్‌లో ఉన్న అన్ని రకాల మెడికల్ బిల్లులను కూడా పెండింగ్‌లో పెట్టకుండ మంజూరు చేయాలన్నారు. మేడ్చల్ జిల్లా తపస్ అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను తపస్ ఉపాధ్యాయ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేసి ఉపాధ్యాయుల సమస్యలను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జిల్లా కోశాధికారి రమాదేవి, సురేందర్, గోపాల్, రమేశ్, రాథోడ్, వెంకటేశ్, సంగమేశ్, శ్రీనివాస్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి కుటుంబ సర్వేను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబరు 5, ప్రభాతవార్త:** సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అన్ని మండలాల ప్రత్యేకఅధికారులు, యంపిడిఓలు, మునిసిపల్ కమీషనర్‌లతో జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడుతూ సామాజిక,ఆర్థిక విద్య రాజకీయ కుల సర్వే సమగ్రఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు మునిసిపల్ గ్రామస్థాయిలో వార్డు నుంచి మొదలుకొని కేటాయించిన బ్లాక్ స్థాయి వరకు పూర్తిస్థాయిలోసమాచార సేకరణ, నమోదును అత్యంత జాగ్రత్తగా నిర్వహించవలసిన అవసరం ఉందని అన్నారు. సర్వే నిర్వహణలో ఎవైన సందేహాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేకు అత్యంత ప్రాదాన్యత ఇస్తున్నదని అలాగే సర్వే నిర్వహణ పట్ల ప్రత్యేకదృష్టి కేంద్రికరించాలని అధికారులకు ఆదేశించారు.ప్రతి తహసిల్దార్ యంపిడిఓ దగ్గర గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటిలు నివాస స్థలాల మ్యాప్‌లుహౌస్ లిస్టింగ్ పార్మాట్, 57 ప్రశ్నల పార్మాట్. సర్వే పూర్తి అయిన ఇంటిపై అతికించే స్టిక్కర్ అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సర్వే అన్నిప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు.రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా ఖరీప్ దాన్యం సేకరణ జరగాలని, ప్రభుత్వం కొత్తగా సన్న దాన్యానికి 500 రూపాయిలు బోనస్ ఇస్తుందనిఅన్నారు. ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా దాన్యం సేకరణ జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో లైట్స్, ప్యాన్స్ అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారికి ఆదేశించారు. ఈ సమావేశంలోజిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డిఆర్‌డిఏ శ్రీనివాస్, సీసీఓ అశోక్, జిల్లా అధికారులు, మునిసిపల్ కమీషనర్లు, అన్ని మండలాల యంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు

### -మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్


మాట్లాడుతున్న మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్

**కొడంగల్, నవంబర్ 5ప్రభాతవార్త:**

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అద్యక్షతన నేటి నుంచి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తెలిపా రు. ఈ మేరకు మంగళవారం ఎన్యూమరేటర్‌లకు సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో జరిగే కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొంటారని తెలిపారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, కుల, విద్య, రాజకీయ తదితర అంశాలపై ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ పరిధిలోని 12 వార్డులకు గాను సర్వేలో మొత్తం 34 మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

## డ్రగ్స్ నివారణపై కళాకారుల అవగాహన

### -ఆకట్టుకున్న కళాకారుల ఆటపాట


డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**కొడంగల్, నవంబర్ 5, ప్రభాతవార్త:** తెలంగాణా సాంస్కృతిక సారథి వికారాబాద్ జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో కళాకారులు తమ ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు బానిసై చదువుకు దూరమైపోతున్నారని కళాకారులు తమ ఆటపాటల ద్వారా ప్రజలకు వివరించారు. డ్రగ్స్, ఇతరత్రా మత్తు పదార్థాలకు అలవాటు పడి నిండు జీవితాన్ని నాశనం చేసుకోరాదని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యాబుద్ధులతో సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. కళాకారులు నిర్వహించిన ఆటాపాటలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణా సాంస్కృతిక సారథి వికారాబాద్ జిల్లా కళాకారులు వెంట్రాములు, అన్నుభాయ్, అర్చన, శ్రీను, సంజీవ, భిక్షపతి, సంధ్య, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మోరు తల్లి అందరిని చల్లగా చూడు

**-దండు మైసమ్మ తల్లికి పూజలు గిరిజన నేతలు**



దండుమైసమ్మ తల్లికి పూజలు చేస్తున్న గిరిజన నాయకులు

**నందిగామ నవంబర్5,ప్రభాతవార్త :** నందిగామ మండలంలోని చంద్రాయన్ గూడ శివారులో ఉన్న దండి మైసమ్మ తల్లికి మంగళవారం గిరిజన నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మోరు తల్లి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని వారు అమ్మవారిని వేడుకున్నారు. ఈ పూజలో సిడి తండా గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జటావత్ రాజు నాయక్, జటావత్ లక్ష్మణ్ నాయక్, హర్షగూడ గిరిజన సీనియర్ నేతలు రాజు నాయక్ తదితరులు ఉన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు పట్టివేత

**పరిగి నవంబర్ 5 ప్రభాతవార్త :** పరిగి పట్టణంలో లారీల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పరిగి పట్టణ పోలీసులు అట్టి ప్రదేశానికి చేరుకుని వాహనాలను తనిఖీ చేయగా ఐదు లారీల్లో ఇసుక రవాణా కొనసాగుతున్నట్లు గుర్తించారు. విచారణ చేపట్టిన పోలీసులు వాహనాలను తనిఖీ చేసి, వాహన పత్రాలు,ఇసుక రవాణా అనుమతి పత్రాలను పరిశీలించి, అనుమతులు ఉన్న లారీలు విడిచిపెట్టి, ఎలాంటి అనుమతులు లేని టిఎస్ 34టిఏ 9189 గల లారీని తహసిల్దార్ కు అప్పగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## క్షతగాత్రులను పరామర్శించిన మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి

**యాచారం నవంబరు5,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని డిఎస్ఆర్ గార్డెన్ సమీపంలో సోమవారం రాత్రి యాచారం మాల్ మధ్యలో నాగార్జున సాగర్ హైవేపై ఆటో ప్రమాదంలో క్షతగాత్రులైన నంది వనపర్తి గ్రామస్తులను మాల్ లోని పీపుల్స్ హాస్పిటల్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే తనయుడు అభిషేక్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి, ఇతర స్థానిక నాయకులతో కలసి పరామర్శించడం జరిగింది ఈ సందర్భంగా అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ... క్షతగాత్రులకు మెరుగైన చికిత్స కోసం అవసరమైతే పెద్ద హాస్పిటల్ కి తరలించాలని ఆదేశించారు. మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రిలో ఇతర డాక్టర్లు అవసరమైతే వారిని సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం నుండి వీలైనంత సాయం చేయిస్తానని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తారని హామీ ఇచ్చారు.

## ఆసరా ఫింఛన్స్ పెంచాలి

**-విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య**



**యాచారం నవంబరు5,ప్రభాతవార్త :** ఆసరా ఫింఛన్స్ పెంచాలని రంగారెడ్డి జిల్లా మాల్‌లో జరిగిన ఆసరా పింఛన్‌దారుల ఆవేదన సభకు ముఖ్య అతిథిగా విహెచ్‌పిఏస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళ జంగయ్య పాల్గొని మాట్లాడుతూ... పింఛన్లు పెంచకపోతే నవంబర్ 26న చలో హైద్రాబాద్ నిర్వహించి ప్రభుత్వంపై తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. నవంబర్ 26న చలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆసరా పింఛన్ దారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి హెచ్ పి ఏస్ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీరామదాసు వెంకటాచారి, గుద్దేటి సైదులు, జిల్లా అధ్యక్షులు కరంటోత్ శ్రీనివాస్, మండల అధ్యక్షులు దేరంగుల ఈశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, యాచారం జంగయ్య, గువ్వల యాదయ్య, మద్దెల బాల్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు మహ్మద్ సలీం, కొమ్ము రాములు, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల సంజీవ, మాల్ మాజీ సర్పంచులు సుబాన్, బెల్లి జంగయ్య, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు బోడ ముత్యాలు, ఎమ్మార్పిఏస్ మండల నాయకులు,మంద లింగం, వి హెచ్ పి ఏస్ గ్రామ శాఖ అధ్యక్షులుపోచయ్య కళాకారులు కుమార్, ఝాన్సి పాల్గొన్నారు.

## టిఎస్ యుటిఎఫ్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక



శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలకు ఎన్నికైన టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్షుల, కార్యవర్గం వారు ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 5, ప్రభాతవార్త** శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలకు టిఎస్ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోగా, అదే విధంగ ఆయా కమిటీలకు కార్యవర్గంను కూడ ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు. మంగళవారం శామీర్‌పేట ఉమ్మడి మండలంలో రెండు మండలాల కమిటీలను ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు. శామీర్‌పేట మండల టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులుగా పి.తిరమలేశ్, ప్రధాన కార్యదర్శిగా యు.కుమార్, కోశాధికారిగా తిరుమల ప్రసాద్, కార్యదర్శులుగా అంజయ్య, నెహ్రూనాయక్, మనోహర్, మహిళా ఉపాధ్యక్షురాలుగ నాగపూర్ణిమ, మంజుల ఎంపికైనట్లు నూతన అధ్యక్షులు పి.తిరుమలేశ్ పేర్కొన్నారు. అదే విధంగ మూడుచింతలపల్లి మండల టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులుగా ఎం.తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.నాగరాజు, కార్యదర్శులుగా బి.నరసింహ, సయ్యద్ షాబాద్, బి.శ్రీనివాసులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు దేవిజా నాయక్, సత్యనారాయణ, శ్రీనివాసులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగ రెండు మండలాలకు ఎన్నికైన టిఎస్ యూటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులను, నూతన కార్యవర్గంలను వారితో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఆ తరువాత రెండు మండలాల నూతన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులను, కార్యవర్గంను ప్రమాణస్వీకారం చేయించారు.

# గోపన్‌పల్లి స్థల వివాదంలో ఎస్ఐ

**-సైబరాబాద్ కమిషనర్, మాదాపూర్ డిసిపిలకు పిర్యాదు చేసిన బాధితుడు**



వివాదానికి కారణమైన సోఫా కాలనీలో గల స్థలం

**గచ్చిబౌలి, నవంబరు 5 ప్రభాతవార్త** రియల్ వ్యాపారులతో కలిసి ఆక్రమించిన ప్లాటును తనకు విక్రయించేందుకు ప్రయత్నించడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ గచ్చిబౌలి సబ్ ఇన్స్‌పెక్టర్ మీద ఓ బాధితుడు సైబరాబాద్ కమీషనర్, మాదాపూర్ డిసిపిలకు పిర్యాదు చేయడం సంచలనంగా మారింది. ఎస్ఐ వ్యవహారశైలిపై ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నాడంటూ బాధితుడు సైబరాబాద్ కమీషనర్ అవినాష్ మహంతి, మాదాపూర్ డిసిపి వినీత్‌లకు పిర్యాదు చేశాడు. సివిల్ వివాదాల్లో తలదూర్చిన ఎస్ఐ మీద అంతర్గత విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఐటి కారిడార్ పరిధిలోని గోపన్‌పల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు బాదితుడి పిర్యాదు ప్రకారం... శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి సర్వే నెంబరు 124రూలో గల సోఫా కాలనీలో ప్లాటు నెంబరు 25లో 200 గజాల స్థలాన్ని సోఫా కాలనీకే చెందిన మహ్మద్ నవాజ్ కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చాడు. సదరు స్థలం నానక్‌రాంగూడకు చెందిన షేక్ మునావర్ పాషా, ఓల్డ్ హాఫీజ్‌పేట్‌కు చెందిన మహ్మద్ సుమీర్‌ల పేరుమీద ఉన్నట్లు గుర్తించి ప్లాటు కొనుగోలు కోసం సెప్టెంబరు 16న 5లక్షల రూపాయలు అడ్వాన్సుగా చెల్లించి అగ్రిమెంటు చేసుకున్నాడు. ప్లాటుకు సంబంధించిన మొత్తం డబ్బు 25 రోజుల వ్యవధిలో చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. కాగా ప్లాటు యజమానుల ఆదేశాల ప్రకారం అడ్వాన్సు డబ్బును గచ్చిబౌలి సబ్ ఇన్స్‌పెక్టర్ మహేందర్‌రెడ్డి సమక్షంలో అందజేసినట్లు నవాజ్ తన పిర్యాదులో తెలిపాడు. డబ్బు సమకూర్చడంలో జాప్యంతో పాటు ప్లాటు విషయంలో తెలిసిన వాస్తవాలతో గడువు వ్యవధిలో తాను డబ్బు చెల్లించలేదన్నాడు. దీంతో అక్టోబరు 17వ తేదీన తన ఇంటికి వచ్చిన ఎస్ఐ మహేందర్‌రెడ్డి మిగిలిన డబ్బుల కోసం అడిగాడని, తనకు మరికొంత సమయం కావాలని కోరాగా, మునావర్ పాషా, సుమీర్‌లతో కలిసి ఎస్ఐ మహేందర్ రెడ్డి సదరు ప్లాటును మరొకరికి విక్రయించారన్నారు. విషయం తెలిసి ఎస్ఐని నిలదీయగా, ప్లాటు వేరొకరికి విక్రయించామని, రాద్ధాంతం చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తానని బెదిరించాడని బాధితుడు వాపోయాడు. కాగా ప్లాటు నెంబరు 25 వాస్తవంగా షేక్ షుక్రూ అనే వ్యక్తికి చెందినదని, గత 13 సంవత్సరాలుగా షుక్రూ పొజిషన్‌లో ఉండి, విద్యుత్ మీటరు, వాటర్ కనెక్షన్ కలిగి ఉన్నాడని తన ద ృష్టికి వచ్చిందన్నాడు. ఎస్ఐ మహేందర్‌రెడ్డి, మునావర్, సుమీర్‌లు కలిసి నకిలీ డాక్యు మెంటుతో షుక్రూను భయపెట్టి, ప్లాటును కబ్జా చేసి తనకు విక్రయించేందుకు ప్రయత్నించడంతోనే తాను కొనుగోలు విషయంలో వెనుకడుగు వేశానని బాధితుడు పిర్యాదు లో తెలిపాడు. తన వద్ద అడ్వాన్సుగా తీసుకున్న 5లక్షల రూపాయలు తిరిగి ఇవ్వకపోగా, క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని తన మీద బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు నవాజ్ సైబరాబాద్ కమీషనర్, డిసిపిలకు పిర్యాదు చేశాడు. కాగా ఈవిషయమై గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ హబీబుల్లా ఖాన్‌ను వివరణ కోరగా, బాదితుడు నవాజ్ పిర్యాదు చేశా డని, పిర్యాదుపై విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాగా గోపన్‌పల్లి స్థల వివాదంలో తలదూర్చిన ఎస్ఐని సదరు సెక్టార్ విధుల నుంచి తప్పించగా, సెలవుపై వెళ్లిన ట్లు తెలుస్తుంది. మరోవైపు ఎస్ఐ వ్యవహారశైలిపై అంతర్గత విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

## దాశరథి రచనలు చదవడం సౌభాగ్యమే : డా. నందిని సిధారెడ్డి



దాశరథిని నివాళులర్పిస్తున్న సిధారెడ్డి, బాలాచారి, ఉడయవర్లు, నాళేశ్వరం, గౌరీశంకర్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, నవంబరు 5 ప్రభాతవార్త :** మహోన్నత సాహితీమూర్తి దాశరథి రచనలు చదవకపోతే నష్టం నేటి కవులు, రచయితలు, యువతరానికి తద్వారా సమాజానికి ఎంతో నష్టమని, చదవడం సౌభాగ్యమేనని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి అన్నారు. మహాకవి దాశరథి కృష్ణమాచార్య 37వ వర్ధంతిని పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లో అకాడమీ కార్యాలయంలో కార్యదర్శి నామోజు బాలాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ సభలో దాశరథితో అనుబంధం కలిగగిన పలువురు సాహితీవేత్తలతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిధారెడ్డి సాహితీవేత్తలు నాళేశ్వరం శంకరం, టి.ఉడయవర్లు, శరత్‌చంద్ర, రూప్‌కుమార్, గౌరీశంకర్, మనోహర్‌రెడ్డి, కె.ప్రభాకర్, ఎస్.రఘు తదితరులతో కలిసి కృష్ణమాచార్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి అకాడమీ దాశరథి వ్రాసిన కథలను ఏరికూర్చి నిప్పుపూలు పేరుతో వెలువరించిన కథల సంపుటిని, అకాడమీ వారి నూతన పునాస సంచికను ఆవిష్కరించి ప్రసంగించారు. దాశరథి పేరుతో స్మారక భవనాన్ని నిర్మించాల్సిన అవసరముందని తెలిపారు. ఉడయవర్లు దాశరదితో తనకున్న అనుబంధాన్ని పంచుకొనగా నాళేశ్వరం శంకరం దాశరథి కథల వైశిష్ట్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆనందాచారి, శరత్‌చంద్ర, రాములు తదితరులు దాశరథి కథల గురించి. కథల్లోని ధిక్కారత్వాన్ని, సినీగేయాల గురించి ప్రస్తుతించారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం కింద నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే దాశరథి మాటల్ని పొందుపరచాలని వారు ప్రభుత్వానికి సూచించారు.

## విద్యార్థులు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలి

**-బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ, గుజ్జకృష్ణ, గుజ్జసత్యం తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 5,ప్రభాతవార్త:** దీర్ఘకాలికంగా, అపరిష్క ృతంగా ఉన్న బీసీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని, విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్‌లో నిర్వహించిన విద్యార్థుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీసీ ఉద్యమాన్ని మరింత పటిష్టవంతంగా, నిర్మాణాత్మకంగా, ఉదృతం చేయడానికి బీసీలు సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బీసీలు రాజ్యాధికార సాధనే ఎకైక లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశంలో 70 కోట్ల మంది బీసీల డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని, లేని పక్షంలో దేశ వ్యాప్తంగా బీసీల ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చుతుందని అన్నారు. పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ యూనివర్సిటీలలో బీసీ, ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, మల్లేష్ యాదవ్, లాల్ కృష్ణ, జిల్లపెల్లి అంజి, నందగోపాల్, సతీష్ రాజేందర్, ఆనంతయ్య, జనార్ధన్, రాందేవ్, పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**- రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**




**అత్తాపూర్ నవంబరు5,ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయా మున్సిపల్ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మండల కార్యదర్శి టి ఆనంద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం దుర్గా కన్వెన్షన్ దగ్గర నిర్వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు...మున్సిపల్లో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పడం జరిగిందని అన్నారు. కార్మికుల అందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులకు క్యాజువల్ లీవ్‌లు అమలు చేయాలన్నారు. అదేవిధంగా జాతీయ పండుగ సెలవుల్ని ఇవ్వాలన్నారు. పారిశుద్ధం పనులు చేస్తున్నటువంటి కార్మికులని చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తున్నారంటే ముందుగా మున్సిపల్ కార్మికుల చేత అని పనులు చేయిస్తారన్నారు.అలాంటి కార్మికులకు కనీస వేతనాలు ఇంప్లిమెంట్ చేయకపోవడం దారుణమని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అనంతరం మైలార్ దేవ్ పల్లి డివిజన్ మున్సిపల్ సంఘం కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి 21 మందితో కమిటీని ప్రతిపాదించడంతో కార్మికులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. అధ్యక్షుడు వై సాయిలు, ఉపాధ్యక్షులు శేఖర్, పెంటయ్య, సంతోష, చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఏ రాజు, సహాయ కార్యదర్శిలు రంజిత్, ఉషా రాణి, మహేష్, కౌన్సిల్ సభ్యులు శ్యామలమ్మ, రాజు, శంకరమ్మ, మోహన్, ఐలేష్, యాదమ్మ, దేవేందర్, రాములమ్మ, నరేందర్, స్వరూప,రమేష్,లక్ష్మిలను ఎన్నుకున్నారు.

## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

**శామీర్‌పేట, నవంబరు 5, ప్రభాతవార్త :** అలియాబాద్ గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలం వద్ద గదిలో ఉన్న వ్యక్తి అనుమానస్పది స్థితిలో మృతిచెందారు. మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామ సమీపంలోని హెచ్‌బిఎల్ కంపెనీ దగ్గర సర్వేనెంబరు 580లో గల వ్యవసాయ పొలం వద్ద పనిచేస్తున్న సూపర్‌వైజర్ ఫారుఖ్ (41) రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి అని, గత ఆరు సంవత్సరాలుగ వ్యవసాయ పొలం వద్ద సూపర్‌వైజర్‌గా ఆయన పనిచేస్తున్నట్లు తెలిపారు. అయితే మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో వ్యవసాయ పొలం వద్ద గల గదిలో సూపర్‌వైజర్ ఫారుఖ్ మృతిచెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు తెలిపారు. దీంతో శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, ఎస్‌ఐలు, సిబ్బంది అందరు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం ఆ గదిలో మంచంపై పడుకుని ఉండి నోట్లో నుంచి నురగలు వచ్చి వాంతి చేసుకుని ఫారుఖ్ మృతిచెంది ఉన్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై చుట్టుపక్కల వారిని విచారణ చేయగా గత ఆరు సంవత్సరాలుగ వ్యవసాయ పొలం వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారని తెలిపారని, మంగళవారం ఉదయం లేచి టిఫిన్ చేసి గార్డెన్‌లో పనిచేస్తుండగ మధ్యాహ్నం 12.30గంటల సమయంలో తనకు కళ్లు తిరుగుతున్నట్లు చెప్పి గదిలోకి వెళ్లి పడుకున్నట్లు తెలిపారని, మధ్యాహ్నం 3.30గంటల సమయంలో పార్క్‌లో పనిచేసే జనార్దన్, ఫారుఖ్ ఉన్న గదికి వెళ్లగా మంచంపై ఫారుఖ్ వాంతి చేసుకుని చనిపోయి పడి ఉన్నట్లు తెలిపారన్నారు. అయితే ఫారుఖ్ అనారోగ్య సమస్యలతోనా, పాము కాటు వల్లనా, మరి ఏ ఇతర కారణాల వల్ల మృతిచెందారా అనేది విచారణలో తేలనుందని పోలీసులు పేర్కొన్నారు. శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ పర్యవేక్షణలో ఎస్ఐ హారిక, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వాహనాల రద్దీతో తరచుగా ట్రాఫిక్ జామ్



గౌలిగూడ టెలిఫోన్ ఎక్చేంజ్ వైపు వెళ్లే రహదారిలో తరుచుగా ట్రాఫిక్ జాం

**బేగంబజార్,నవంబర్ 5 ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతంలో వాహనాల రద్దీ వల్ల తరచుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నది.దీంతో వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్న ప్రజలు నరక యాతనకు గురివుతున్నారు.సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోల్సావాడి,రాంనాథ్ ఆశ్రమం,దంతకళాశాల వెనుక వైపు రహదారి, ఇరువైపుల్లా ద్విచక్రవాహనాలను మొదలుకుని కార్లు,లారీలను అడ్డదిడ ఒగా వాహనాలు పార్కింగ్ చేసి ఉంటున్నాయి. ముఖ్యంగా ప్రధాన వ్యాపార వాణిజ్య కేంద్రం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి లారీలలో వచ్చే సరుకులనతోపాటు ట్రాన్స్‌పోర్టు యాజమానులు ఇతర జిల్లాలకు తరలించే సామాగ్రిని సైతం అక్కడ నిలిపి లోడింగ్, ఇన్‌లోడింగ్ చేస్తున్నారు.ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు.కొన్ని సందర్భాలలో వాహనదారుల మధ్య చిన్న, చిన్న గొడవలు చోటు చేసుకుంటున్నాయి.గౌలిగూడ చమన్ మీదుగా ఉస్మాన్‌గంజ్‌లోకి ఎంజె మార్కెట్, వైపు మీదుగా ప్రయాణం చేస్తున్న ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికి ఫలితం లేకపోయిందని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతోసైతం ట్రాఫిక్ సుడిగుండంలో చిక్కుకుని తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ధుమ్ము, ధూళిని భరించలేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు రోడ్డు మీదుగా నడిచి వెళ్ళె సమయంలో పడుతున్న బాధలు వర్ణానతీతం.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ట్రాఫిక్ పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.గౌలిగూడ చమన్ నుంచి వెళ్లే రహదారి కూడా వాహనాలతోపాటు వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసే వారి వాహనాలు రహదారిపై అడ్డదిడ్డంగా పెడుతుంటారు.ట్రాఫిక్ పోలీసులు,లాఅండ్ అర్డర్ పోలీసుల సమన్వయం లేకుండా పోయింది.తరుచుగా ఈరహదారి గుండా ట్రాఫిక్ జాం కలుగుతుంది.ఇప్పటికైనా సుల్తాన్‌బజార్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కవాడిగూడలో అగ్నిప్రమాదం

**పరామర్శించిన స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్**



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గం, కవాడిగూడ డివిజన్‌లోని మారుతినగర్‌లోని ఒక ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మారుతినగర్‌లో ఒక ఇంట్లో సునీత అనే మహిళ ఇద్దరి పిల్లలతో నివసిస్తూ ఉంది. మంగళవారం మధ్యాహ్నం విద్యుత్‌ఘాతంతో ఇంట్లో నుండి ఒక్కసారిగి మంటలు రావటం స్థానికులు గమనించి, చూడగా అప్పటికే ఇంట్లో సామానంతా కాలి బూడిదవుతోంది. ఇంట్లోనే ఉన్న సునీత కొడుకుని స్థానికులు రక్షించటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు కానీ దాదాపు రెండు లక్షల వరకు ఆస్థి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఘటనా స్థలికి చేరకుని పరిస్థితిని సమీక్షించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చి, తక్షణ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.

## మాలలను అణచివేసేందుకే కుట్రలు

**ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్ రాజు ఉస్తాద్**



ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తున్న నేతలు

**ముషీరాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త:** మాలలను అణచివేసేందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్ రాజు ఉస్తాద్ ఆరోపించారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు ఎత్తి వేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే ప్రభుత్వాలు కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న జరగబోయే మాల గర్జన ద్వారా మాలల సత్తా ఏంటో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడ్డిమల్ల వినోద్‌కుమార్, దాసరి విశాల్, విజయ్, వసేటి రవీందర్, సుధాకర్, ఉత్తమ్, సుమన్, పవన్, కమల్, రాజు, సుధీర్, నర్సింహులు, ఉమాకాంత్, ప్రమోద్, నవీన్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం కోశాధికారిగా బింగి నవీన్

**ముషీరాబాద్, నవంబర్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం కోశాధికారిగా బింగి నవీన్ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్‌కుమార్ నియామకపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బింగి నవీన్ మాట్లాడుతూ పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు శాతం ఉన్న పద్మశాలీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. పద్మశాలీల చేతివృత్తిని, మరమగ్గాల రక్షణ లక్ష్యంగా చేనేత వస్త్రాల వాడకాన్ని ప్రోత్సహించేవిధంగా పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో బాధ్యతలు అప్పగించినందుకు అధ్యక్షులు వల్లకాటి రాజ్‌కుమార్ తదితరులకు ఆయన ధన్యవాదములు తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 5, ప్రభాతవార్త** గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్నంకు చెందిన రాజు అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల బస్ స్టాప్ సమీపంలో గంజాయితో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో కూకట్‌పల్లి పోలీసులు దాడి చేసి అతని వద్ద నుంచి 2.3కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. పోలీసుల విచారణలో నిందితుడు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు.



సికింద్రాబాద్ ప్యారేడైజ్ హోటల్‌లో బిర్యానీ తీంటున్న మాజీ మంత్రి కెటిఆర్,ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్,పద్మరావు,ముఠా గోపాల్,మాగంటి గోపినాథ్ తదితరులు

## ఘనంగా నాగుల చవితి వేడుకలు



బేగంపేట శ్రీరేణుకా ఎల్లమ్మ నాగదేవత ఆలయంలో నాగుల చవితి వేడుకల సందర్భంగా పుట్టలో పాలు పోస్తున్న భక్తులు.

**బేగంపేట నవంబరు 5,ప్రభాతవార్త** బేగంపేట ప్రకాశంనగర్ శ్రీరేణుకా ఎల్లమ్మ,నాగదేవత ఆలయంలో మంగళవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులు పుట్టలో పాలు పోసేందుకు,పూజలు నిర్వహించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఫౌండర్ ఛైర్మన్ జాండ్ల కృష్ణ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేసారు.ఈ సందర్భంగా మహిళలు,చిన్నారులు ఉదయం తల స్నానం చేసి పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. చలిమిడి, చిమ్మిలి,అరటిపండ్లు,కోడిగుడ్లు,పాలు తదితర పదార్థాలను ప్రసాదంగా సమర్పించారు.పుట్ట మట్టిని పుట్ట బంగారంగా భావించి చెవి బాధలు ఉన్న వారికి చెవులకు పెట్టుకున్నారు.ఈ సందర్భంగా పుట్ట వద్ద దీపావళి రోజు మిగిలిన కాకర పువ్వుత్తులు,టపాసులు కాల్చి చిన్నారులు సంతోషం వ్యక్తం చేసారు.ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఛైర్మన్ జాండ్ల కృష్ణతో పాటు టి.రేవంత్‌సాయి. లక్ష్మినారాయణ, టి.దీపిక,తుకారం,కిరణ్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమిత్రల డాటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్‌ను వెంటనే అమలు చేయాలి

**చిక్కడపల్లి, నవంబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆరోగ్యమిత్రలకు ఇచ్చిన హామీ మేరకు డాటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్‌ను వెంటనే అమలు చేయాలని ఆరోగ్యశ్రీ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య కోరారు. తాము సమ్మె విరమించి 45 రోజులు అయినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరోగ్యమిత్రలు తీవ్రమైన నిరాశకు లోనవుతున్నారని, ఇప్పటికైనా మంత్రి చొరవ తీసుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

## సిఎంఆర్ఎఫ్ పథకం ఆరోగ్య సంజివని



చెక్కులను పంపిణీ చేస్తున్న ముఠాగోపాల్

**చిక్కడపల్లి, నవంబరు 5 ప్రభాతవార్త:** సిఎంఆర్ఎఫ్ పథకం ఆరోగ్య సంజివని అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కవాడీగూడ బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ డివిజన్‌కు చెందిన సిఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఘాన్సీబజార్ ఝులాలో చెడి పోయిన రహదారులు

**-పట్టించకోని అధికారులు**



ఘాన్సీ బజార్ ఝూలో చెడి పోయిన రహదారి

**చార్మినార్,నవంబరు 5 ప్రభాతవార్త :** ఘాన్సీబజార్ డివిజన్ పరిధిలోని ఝూలా ప్రాంతంలో రహదారి చెడిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.రోడ్డంతా గుంతలు మయంగా మారటంతో స్థానిక ప్రజలు నడవలేని పరిస్థితి ఏర్పడింది.నిత్యం ఈ రహదారి వెంబడి వందలాది మంది ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. రాత్రి వేళల్లో చీకటిలో ఝూలా రహదారి మీదుగా ప్రయాణం చేయాలంటనే ప్రజలు భయపడుతున్నారు.ఝూలాలో ఉన్న మందిరానికి ప్రతీరోజు చేయటానికి భక్తులు వస్తున్న సమయంలో నానా అవస్థలు పడుతున్నారు.ఝూలా నుంచి చేలాపుర,కోకరివాడి,షక్కర్‌కోట,ఆనందగల్లీ బస్తీలకు వెళుతున్న ప్రజలు రహదారిపై ఉన్న గుంతలలో జారి పడి గాయాల పాలవుతున్నారు.జిహెచ్‌ఎంసి అధికారులకు ఝూలాలో కొత్త రహదారిని నిర్మించాలని పలు మార్లుమొరపెట్టుకున్నప్పటికి ఫలితం లేకపోయింది.వస్త్రాలు,బంగారం,డైమండ్స్ వ్యాపారాలకు ఎంతగానో ప్రసిద్ధి గాంచిన ఘాన్సీబజార్‌లో రహదారులు చాలా అధ్వానస్థితిలో ఉన్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘాన్సీబజార్ ఝూలాలో కొత్త రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

## గంజాయి స్మగ్లింగ్ చేస్తే కఠిన చర్యలు

**-డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి**

**జహీరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** గంజాయ స్మగ్లింగ్ చేసినా, పండించినా కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని శేఖాపూర్ తండాలో డిఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ చదువుకున్న కొందరు గంజాయిని స్మగ్లింగ్ చేస్తూ వ్యాపారం చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, వారిని పోలీసులు ఆపేయాలని హెచ్చరించినా మళ్లీ గంజాయిని ఇతర జిల్లాల నుంచి స్మగ్లింగ్‌చేస్తూ వ్యాపారం చేసుకుంటున్నారని, అది మానేసి పోలీసులకు లొంగిపోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్మగ్లర్లకు గ్రామస్థులు సహకరించవద్దని, వారి వివరాలకు పోలీసుకులు సమాచారం అందించాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామి చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శివలింగం, రూరల్ సిఐ జక్కుల హనుమంతు, జహీరాబాద్ పట్టణ, రూరల్, చిరాగ్‌పల్లి, ఝరాసంగం, హద్నూర్, రాయికోడ్ పోలీసుఠాణాల ఎస్ఐలు ఎం.కాశీనాథ్, వరప్రసాద్, రాజేందర్‌రెడ్డి, నరేష్, చల్లా రాజశేఖర్, కృష్ణ, ప్రత్యేక సిబ్బంది పాల్గొన్నారు.

### మహాధర్నాకు తరలివెళ్లిన ఆటో కార్మికులు


చలో ఇందిరాపార్కు మహాధర్నాకు పయనమైన ఆటో కార్మికులు

**పాపన్నపేట, నవంబరు 5, ప్రభాతవార్త:** ఆటో కార్మికుల సమస్య సాధనకై హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టే మహాధర్నా కార్యక్రమానికి రాష్ట్ర ఆటో యూనియన్ పిలుపు మేరకు మంగళవారం మండలం ఆటో యూనియన్ నాయాకులు భాగ్యనగరానికి బయలు దేరారు. మంజీరా ఆటో యూనియన్ జేఏసి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ జఫిరుద్దీన్, ఉపాధ్యక్షులు రాజేందర్, మండల అధ్యక్షులు బిలాల్, సభ్యులు బాబర్ భాయ్, సాండు, రాజా గౌడ్, ఫారూఖ్, షరీఫ్, ఇమ్రాన్, బిఖ్యు రాకేష్, దాసు తదితరులు మహాధర్నాకు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

### బిసి సంఘాల పోరాట ఫలితమే డెడికేటెడ్ కమిషన్

**బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్**


మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 5, ప్రభాతవార్త :** బిసి సంఘాల పోరాట ఫలితమే డెడికేటెడ్ కమిషన్ అని బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ బిసి కమిషన్ ఏర్పాటుచేయడంపట్ల సంక్షేమ సంఘాలనాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి పాలాభిషేకం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా ఆర్ కృష్ణయ్య బిసి కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపాదికన బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని చేసిన పోరాటాలు ఇప్పటికి ఫలించాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పిడిశెట్టి రాజు, వెల్దండి సంతోష్, రాజేందర్, చొక్కాచారి, సమ్మయ్య, సుదర్శనచారి, రాజయ్య, శంకర్, రామస్వామి ఉన్నారు.

### ఓటు హక్కు విలువ తెలియజేసేందుకే మాక్ పోలింగ్ : ప్రిన్సిపాల్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 5,ప్రభాతవార్త :** విద్యార్థులకు ఓటు హక్కు విలువను తెలియజేసేందుకే పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించడం జరిగిందని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్, చైర్మెన్ బుర్ర రాజేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోగల పాఠశాలలో హెడ్‌బాయ్,హెడ్‌గర్ల్స్‌ను ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కు విలువను తెలియజేయడంతో పాటు ఓటును అమ్ముకోకుండా మంచి నాయకులను ఎన్నుకోవాలని, అలా అయితేనే సమ సమాజం బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్లిశైలేందర్,పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కోహెడ, నవంబరు 5, ప్రభాతవార్త:** మండలంలోని సముద్రాల గ్రామంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా బుధవారం గ్రామ పంచాయతీ వద్దగల 11కేవి, ఎల్‌టి లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాను ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని ఎస్పిడిసిఎల్ ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్) మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ వినియోగదారులు ఇందుకు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

### మధ్యాహ్నం పాఠశాలలు మూసివేయడం తగదు

**టిపిటిఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి**

**చిన్నకోడూరు, నవంబరు 5, ప్రభాతవార్త:** ప్రభుత్వం సామాజిక,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర సర్వేకు ప్రాథమిక పాఠశాలలను మధ్యాహ్నం పూట మూసివేయడం తగదని టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జి. తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నకోడూరు మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, చంద్లాపూర్, రామంచ. విఠలాపూర్, అల్లీపూర్ తదితర పాఠశాలలో మంగళవారం సభ్యత్వ, సమస్యల సేకరణ చేపట్టారు. సమగ్ర సర్వేలో ఆయా గ్రామాలలో బోధించే ఉపాధ్యాయులను ఉదయం పూట సర్వేకు ఉపయోగించుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సర్వే డ్యూటీలు వేయడం వల్ల ప్రాథమిక విద్య కుంటుపండుతుందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులకు సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగం పట్ల నిర్లక్ష్యాన్ని విడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలు చెల్లించడంతో పాటు పిఆర్‌సిని అమలు చేయలన్నారు. పది వేల హెచ్ఎంల పోస్టులను ఎస్‌జిటి ఉపాధ్యాయులతో పదోన్నతల ద్వారా భర్తీ చేసి విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు నరసింహారెడ్డి, శివాజీ, మహేందర్, దేవరుషి, లక్ష్మయ్య, శ్రీనివాస్, చెన్నకేశవులు, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిపిటిఎఫ్ నాయకులు

# కుల గణన సర్వేతో బడుగు,బలహీన వర్గాలకు న్యాయం

## కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** హైదారాబాద్‌లోని బోయినపల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణనపై అభిప్రాయాల సేకరణ చేపట్టడానికి ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఏఐసిసి అగ్రనేత పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విచ్చేస్తుండడంతో జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాల నుంచి ఆయా పార్టీల ఇన్‌చార్జిల నాయకత్వంలో పార్టీ శ్రేణులు మంగళవారం భారీ తరలివెళ్లారు. సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తూకుంటు నర్సారెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బస్సుల్లో ఇతర వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భగా కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు అనుకూలంగా పెద్దయెత్తున్న నినాదాలు చేశారు. కుల గణన సర్వేతో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. కుల జన గణన సర్వేలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సిద్దిపేట నుంచి హైదారాబాద్‌కు తరలివెళ్లిన వారిలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, మైనార్టీ నాయకులు కలీం, పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, మంద పాండు,షాబుద్దీన్, మిద్దె రవి, మెరుగు రాజు,రశాద్, మున్నా,వనజ, సంతోషి తదితరులు ఉన్నారు.


హైదారాబాద్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు


భూసార పరీక్ష నమూనాను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

### పంట దిగుబడులకు భూసార పరీక్ష ముఖ్యపాత్ర : డిపివో

**చిన్నకోడూరు, నవంబరు 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాముని పట్ల గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం భూసార పరీక్ష నమూనా సేకరణను డిఏఓ రాధిక పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌హెచ్‌సి-2024లో భాగంగా మండలానికి 5882 మట్టి నమూనాలు తీసి సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ సంగారెడ్డికి పంపించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో భూసారం నమూనా ఎలా సేకరించాలో అవగాహన కల్పించారు. పంట దిగుబడులకు భూసార పరీక్ష ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జయంత్, విస్తరణ అధికారులు నిర్మల, శివ, ప్రశాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్చరీ రాష్ట్ర అధ్యక్షుడు రాజుకు సన్మానం


తలకొక్కుల రాజును సన్మానిస్తున్న సుల్తాన ఉమర్

**గజ్వేల్ టౌన్, నవంబరు 5 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన న్యాయవాది తలకొక్కుల రాజును మంగళవారం ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ మాట్లాడుతూ గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది, సామాజికవేత్త తలకొక్కుల రాజు తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. భారతదేశంలో ప్రాచీన రాజుల కాలంలో విలు విద్య ఎంతో ప్రాముఖ్యమైనదని, అలాంటి విలువిద్య ఆధునిక కాలంలో శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానంతో నగరాలకే ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమైందని, అలాంటి ఆర్చరీ క్రీడలను రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపచేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహించి ఆర్చరీ క్రీడలలో నిష్ణాతులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకుడు తుమ్మ శ్రీనివాస్, ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు, కోశాధికారి మహమ్మద్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

### మిట్టపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంపు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 5, ప్రభాతవార్త:** ఇందూర్ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామాన్ని దత్తతకు తీసుకున్నారు. గ్రామంలో వారం రోజుల నుంచి ప్రత్యేక క్యాంపు నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసే పథకాలు అన్ని అందుతున్నాయా లేదా అని సర్వే చేశారు. అలాగే రెండో రోజు మద్యపానం వలన జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు. మూడో రోజు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పోషణ ఆహారంపై తెలియజేశారు. నాల్గో రోజు ఆర్‌విఎం మెడికల్ కాలేజీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 5వ రోజు స్వచ్ఛభారత్ నిర్వహించారు. చివరి రోజు జానపద గేయాలు,కల్చరల్ అక్టివిటీస్‌తో ప్రోగ్రాం ముగించారు. క్యాంపులో కాలేజీ ప్రిన్సిపల్ విపిరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ రాంచందర్, పిఆర్‌ఓ బొడ్డు రఘు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**హత్నూర, నవంబరు 5,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు, వార్డు మాజీ సభ్యులు మొహమ్మద్ ఆసిఫ్ తండ్రి మమ్ము మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి వారి అంత్యక్రియలకు హాజరై వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనో ధైర్యాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ నయిం ఉద్దీన్,సత్యం గౌడ్, మహ్మద్, మాజీ వైస్ ఎంపీపీ పండుగ రవీ లక్ష్మీ, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ కొన్యాల నర్సింహారెడ్డి, రాంచంద్ర రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆశయ్య, మాజీ సర్పంచి చందపూర్ క్రిష్ణ, వీరేందర్ పాల్గొన్నారు.

## ధర్మసత్రం మందు పేరుకుపోయిన చెత్త

**-పట్టించుకోని అధికారులు.. ఇబ్బందులు పడుతున్న భక్తులు**

**ఝరాసంగం, నవంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వర స్వామి ఆలయ కొత్త ధర్మసత్రం ముందు చెత్త పేరుకుపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చిన భక్తులు, కాలనీ వాసులు దుర్గంద వాసనతో అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలనే అపరిశుభ్రతను తొలగించని అధికారులు ఇక మారుమూల గ్రామాలోని పరిస్థితిపై ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఝరాసంగంలో సత్రం కుండీలో చెత్త కూరుకుపోతున్నా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహిస్తుండటం పట్ల భక్తులు భగ్గు మంటున్నారు. శివుడికి ప్రత్యే మాసం అయిన కార్తీక మాసంలో స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు రాత్రికి చేరుకుని ధర్మసత్రంలో రాత్రికి విశ్రాంతి తీసుకుని వేకవ జామున స్వామి అమ్మవార్లను దర్శించుకుంటూ ఉంటారు. రాత్రికి ధర్మసత్రంలో బస చేసిన భక్తులకు చెత్త కుప్పల నుంచి వెదజల్లుతున్న దుర్గందం ముక్కుపుటలదిరేలా ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి చెత్తకుప్పలను తొలగించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులతో పాటు ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి వస్తున్న భక్తులు సూచిస్తున్నారు.


శ్రీ కేతకి ఆలయ ధర్మసత్రం ముందు పేరుకుపోయిన చెత్తకుప్ప


స్వామి వారికి విరాళం అందిస్తున్న భక్తులు

### స్వామి వారికి విరాళాలు అందించిన దంపతులు

**కొమురవెల్లి, నవంబరు 5, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో సిద్దిపేటకు చెందిన చింతల చంద్రహాస్ మాధవి దంపతులు స్వామివారి శాశ్వత నిత్య అన్నదాన మహారాజ పోషకులుగా రూ.100116, నిత్య అన్నదానదాతలుగా రూ.రూ.10116, శాశ్వత కల్యాణ దాతలుగా రూ,5016, శాశ్వత పూజ దాతలుగా రూ.1116 స్వామి వారికి విరాళంగా అందించారు. దేవాలయంలో నిర్మించే 100 గదుల సత్రంలో రెండు సత్రాలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్,ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, అర్చకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల ఆత్మహత్యల పాపం బిఆర్ఎస్‌దే

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌యాదవ్**


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**చిన్నకోడూరు, నవంబరు 5, ప్రభాతవార్త :** గడిచిన 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో గ్రామ పంచాయతీల పాలన చాలా అధ్వాన్నంగా ఉండేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్‌యాదవ్ అన్నారు. చిన్నకోడూరులో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ పానలలో గ్రామ పంచాయతీలలో పని చేసే కార్మికులకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదన్నారు. సర్పంచ్‌ల జీతాలు,బిల్లులు చెల్లించకుండా రాష్ట్రంలో ఎందరో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ కుటుంబం కారణమైందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను బిల్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టి అధికారంలోకి వచ్చిన పట్టుమని 10 నెలలు కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్‌రావు అర్థం, పర్థం లేకుండా వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బిల్లులు చెల్లించకపోవడంతోనే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఎన్ని నాటకాలు అడిన ప్రజలు నమ్మే పరిస్థితులో లేరన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పొన్నాల రాజేష్, కొమ్ము ప్రశాంత్, కోర్రి శంకర్, నముండ్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్**



మాట్లాడుతున్న జనార్ధన్

**సిద్దిపేట రూరల్, నవంబరు 5, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో సంక్షేమ వసతి గృహ అధికారులు సక్రమంగా మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించి విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెరిపోతుల జనార్ధన్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా విద్యార్థి సంఘాల పోరాటాలు, త్యాగాల ఫలితంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెరిగాయయని చార్జీలు పెంచిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఉరుకోమన్నారు. ఈనెల చివరి వారంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలను సందర్శిస్తామని తెలిపారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సంగెం మధు, వేల్పుల ప్రసన్నకుమార్, జక్కల అనిరుధ్, బాణోత్ నవీన్, యాశీన్, శ్రావణ్‌లు పాల్గొన్నారు.

## సర్వేకు ప్రజలు సహకరించాలి

**గజ్వేల్ టౌన్, నవంబరు 5 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సామాజిక మరియు కుల గణాంకాల సర్వేకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. ఈనెల 6వ తేదీ నుండి ప్రారంభమయ్యే సర్వే నిమిత్తం 67 మంది ఎన్యుమరేటర్లు, 7 మంది సూపర్వైజర్లను కేటాయించినట్లు తెలిపారు. సర్వేకు వచ్చే అధికారులకు కుటుంబ వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు.

## గజ్వేల్‌లో బిజెపి నాయకుల సమావేశం

**గజ్వేల్ టౌన్, నవంబరు 5 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బిజెపి నాయకులతో మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బిజెపి సభ్యత్వ నమోదు జరగాలని, ప్రతి బూత్‌లో 50 సభ్యత్వాలు పూర్తి చేసిన వారికి పార్టీలో క్రియాశీల సభ్యత్వం ఇస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు 100 సభ్యత్వాలు పూర్తిచేసి క్రియాశీల సభ్యత్వం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రాజు, మండల ఉపాధ్యక్షుడు అరవింద్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బాలయ్య, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

### అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 5, ప్రభాతవార్త :** తెలంగాణ అంబేద్కర్ సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసిఇంగిల్‌విండో డైరెక్టర్ మ్యాక రమేష్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేప్యాల ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నేపధ్యంలో హుస్నాబాద్‌లో జరిగిన సమావేశంలో రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాష్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నకైన రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాద్యతలు సక్రమంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్లన్న, సుధాకర్, బాబు, కృష్ణ, వెంకన్న, సారయ్య, జగదీష్, సంపత్, కుమార్, రాజీవ్ తదితరులు ఉన్నారు.

### ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

**అక్కన్నపేట, నవంబరు 5,ప్రభాతవార్త :** ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రవాలని వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రప్రకాష్ అన్నారు.మంగళవారం రోజున మండలంలోని జనగామ గ్రామంలో పలు ఆయిల్ తోటలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఆరు నెలల క్రితం ఇయిల్ ఫామ్ టన్ను ధర రూ 13వేలు ఉంటే ఇప్పుడు 19వేలకు చేరిందన్నారు.ఈ పంట సాగు కోసం ప్రభుత్వం సైతం రైతులకు 90శాతం సబ్సిడీ ఇస్తూ తోడ్పాటు నందిస్తుందన్నారు.ఈ పంట సాగు దిగుబడి మొక్క నాటిన నుండి నాలుగేళ్ళకు మొదలవుతుందన్నారు.

### టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడిగా బాలరాజు

**పాపన్నపేట, నవంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడిగా ఈ.బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌కిషన్ పేర్కొన్నారు. మంగళవారం మండల శాఖ సర్వసభ్య సమావేశాన్ని యుపిఎస్ ఎల్లాపూర్‌లో బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ రాష్ట్ర కార్యదర్శి రామ్ హాజరై రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, పిఆర్‌సిని ప్రకటించి అమలుచేయాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల అధికారులుగా నజీరుద్దీన్, గోపాల్, పరిశీలకులుగా రాష్ట్రకౌన్సిలర్ హీరాలాల్ వ్యవహరించారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలి

**-ఎంఐఎం మండల అధ్యక్షుడి మోహిద్ పటేల్**

**నారాయణఖేడ్ టౌన్, నవంబరు 5, ప్రభాతవార్త:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని అర్హులైన వారు బాధ్యతతో తమ ఓటును నమోదు చేసుకోవాలని ఎంఐఎం మండల అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మోహిద్‌పటేల్ సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లా, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయులు శాసనమండలి ఎన్నికల్లో ఓటరు హక్కును వినియోగించేందుకు 2021 అక్టోబరు 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని వివరించారు. అర్హులైనవారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు.

### విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

**జహీరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** మొగుడంపల్లి మండల పరిధిలోని ధనసిరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు మంగళవారం మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్లేట్‌లను అందచేశారు. విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు జితేందర్, దాలొసింగ్ మల్లయ్యస్వామి, చంద్రశేఖర్, పరమేశ్వర్, మంజుల తమ సొంత డబ్బులతో ప్లేట్‌లు కొనుగోలు చేసి విద్యార్థులకు అందచేశారు. విద్యార్థులకు ప్లేట్లు అందచేసిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించగా విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్‌కుమార్,సురేష్‌కుమార్, నాగిశెట్టి, సంగమేశ్వర్,విద్యార్థులు పాల్గొన్నారు.

### కాస్మొటిక్ చార్జీల పెంపుపై కాంగ్రెస్ నేతల సంబరాలు

**అక్కన్నపేట, నవంబరు 5,ప్రభాతవార్త :** ఎస్సీ, ఎస్టీ, బిసి, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం పట్ల కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం అక్కన్నపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య నాయకులతో కలిసి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే చార్జీలు పెంచిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల సొసైటీ కార్యదర్శులకు ప్రిన్సిపాల్ వీణచందన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల సంజీవరెడ్డి, రాజిరెడ్డి, ఎల్లయ్య, భాస్కర్‌నాయక్, ముకుందరెడ్డి, బాలరాజు, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

### అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, నవంబరు 5, ప్రభాతవార్త :** రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని గంగాపూర్ సొసైటీ చైర్మన్ ములుకల కనకరాజు అన్నారు. మండల పరిధిలోని చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామంలో గంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.అన్నిరకాల వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకోవాలన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రైతులకు అందించిన సంక్షేమ పథకాలు కొనసాగించాలన్నారు. రైతులు ధాన్యం అరబెట్టి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఉమేష్‌చంద్ర, కొండం రవీందర్‌రెడ్డి, పరుశరాములు, సొసైటీ సీఈవో నాగరాజు,సిబ్బంది పరుశరాములు, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

### దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దు

**కొండపాక, నవంబరు 5, ప్రభాతవార్త :** దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దని పిఏసిఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్ అన్నారు. కుకునూరపల్లి మండల పరిధిలోని కుకునూరుపల్లి, మంగోల్, లకుడారం, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసినందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, వాసరి లింగరావు, మాజీ రైతుబంధు సమితి రాష్ట్ర కైన్సిల్ మెంబర్ దేవి రవీందర్, పిఏసిఎస్ డైరెక్టర్ నరసింహ్మాచారి, మాజీ సర్పంచ్ కిరణ్ కుమార్, మాజీ ఎంపిటీసి భూములు గౌడ్, నాయకులు తూం శ్రీకాంత్‌రెడ్డి, కందూరి ఐలయ్య, మల్లం ఐలయ్య, రెడ్డమైన రవీందర్, అయా గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మంగోల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

## కాలనీ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే



డ్రైనేజీ సమస్యపై వివరిస్తున్న భాగ్యనగర్ కాలనీ ప్రజలు

**ఇబ్రహీంపట్నం,నవంబరు5, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని భాగ్యనగర్ కాలనీలో డ్రైనేజి సమస్యపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పందించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పలు అభివృద్ది శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్న విషయం విదితమే. ఈ సందర్భంగా భాగ్యనగర్ కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేసి కాలనీలోని సమస్యపై వివరించారు. దీంతో ఎమ్మెల్యే అధికారులను వెంటనే సమస్యపరిష్కరించాలని ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని22వ వార్డులో నిర్మించతలపెట్టిన మల్టిపర్పస్ హాల్‌కు కేటాయించిన నిధులను భాగ్యనగర్ కాలనీలో అండర్ డ్రైనేజి పనులకు మార్చాలని ఆదేశించారు. దీంతో కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### జిల్లాస్థాయిలో ఎంపికైన మండల విద్యార్థులు

**బొంరాస్‌పేట్,నవంబరు 5,ప్రభాతవార్త ః** వికారాబాద్ జిల్లా స్థాయి పరుగు పందెం పోటీలలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల బొంరాస్‌పేట్‌లో చదువు తున్న విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందనపి వ్యాయమ ఉపాధ్యా యులు శ్రీకాంత్ తెలిపారు.వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించిన అథ్లెటిక్ పరుగు పందెంలో 17సంవత్సరాల బాలికల విభాగంలో 100 మాటర్ల పరుగు పందెంలో మస్రత్‌బేగం, 4వందల మీటర్ల పరుగు పందెంలో 17 సంవత్సరాల బాలుర విభాగంలో 2వ స్థానంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎంపికకావడం జరిగిందని వారు తెలిపారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు గోపాల్

**బొంరాస్‌పేట్,నవంబరు5,ప్రభాతవార్త ః** మండల పరిషత్ కార్యలయంలో ఏర్పాటుచేసి సమగ్ర కుటుంబసర్వే శిక్షణ కార్యక్రమును నిర్వహించారు. బుధవారంనుండినిర్వహించే సమగ్రకుటుంబసర్వేలో విధులు నిర్వహించనున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మండల స్పెషల్ ఆఫీసర్ రాంరెడ్డిని మండల యూటీఎఫ్ అధ్యక్షులు గౌరారం గోపాల్ కోరారు.సర్వేలో విధుల నిర్వహణకు కేటాయించిన వారికి మేడికల్ గ్రౌండ్‌సమస్యలు ఉన్నవారికి మినహింపుతోపాటు సంవత్సరంలోపు పిల్లల సంరక్షణలోఉన్న మహిళా ఉపాధ్యాయులకు విధులనుండి మిన హింపును ఇవ్వాలన్నారు.సర్వే పూర్తియ్యేవరకు ప్రాథమిక పాఠశాలలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నిర్వహించే తరగతులలో ఉపాధ్యా యుల సౌలభ్యంరీతిలోసర్వేఉండాలన్నారు.గ్రామాలలోమధ్యాహ్న సమ యంలో ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్ళుతుంటారు మండల స్థాయిఅధికారులు ఎంపిడిఓ వెంకన్నగౌడ్, ఎంఈఓ హరిలాల్, ఎంపిఓ పాల్గొన్నారు.

### మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించిన వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు అనంద్



పరామర్శిస్తున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు అనంద్

**కోట్‌పల్లి,నవంబరు 05,ప్రభాతవార్త;** కోట్‌పల్లిమండల పరిధిలోని బార్వాద్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచు నర్సింహరెడ్డి గారి బార్య నర్సమ్మ, మాజీ ఉప సర్పంచు శ్రీశైలం గారి అల్లుడు మరియు సాఫయి కార్మికుడు బందయ్య, అదే విధంగా కోత్తపల్లి గ్రామానికి చెందిన వెంకయ్య ఇటీవల మరణించడంతో మంగళవారంనాడు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు అనంద్‌వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయన వెంట బీఆర్ఎస్ పార్టీమండల అధ్యక్షులు సుందరి అనిల్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, మాజీ సర్పంచు గోడ్డలి మల్లయ్య, యూత్ అధ్యక్షులు కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మహిళ మృతదేహం లభ్యం

**కడ్తాల్, నవంబరు 05 ప్రభాతవార్త :** మండలంలోని కర్కల్ పహాడ్ గ్రామ సమీపంలోని భారత్‌పెట్రోల్ బంక్‌వద్ద గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని గుర్తించినస్థానికులు కడ్తాల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్సై వరప్రసాద్ పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన మహిళ 35, నుంచి 45, ఆరెంజ్ కలర్‌బ్లౌజ్, గ్రీన్‌కలర్ చీర, ముఖం గుర్తుపట్టనంత ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజులక్రితం మహిళశవాన్ని ఇక్కడ పడేసినట్లు వారు అనుమాని స్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

### మెనూ పాటించని వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలి

**ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (నవంబరు 05) :** నియోజకవర్గ పరిధిలో ఉన్న హాస్టళ్లలో మెనూ ప్రకారం వార్డెన్‌లు భోజన సదుపాయం అందించడం లేదని, వారిపట్ల చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జి ఆకాష్‌నాయక్ మంగళవారం ఆర్డీవో సరితను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వార్డెన్‌లు స్థానికంగా ఉండకుండా ఇతర ప్రాంతాలకు నిరంతరం ప్రయాణం చేస్తున్నారని పేర్కొన్నారు. వార్డెన్‌ల పట్ల ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం కారణంగా హాస్టళ్లకు వచ్చే కూరగాయలు, పాలు, వంట సామాగ్రి నాణ్యత లేకుండా ఉంటున్నాయని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గతంలో పలుమార్లు సొంత భవనాల ఏర్పాటు కోసం వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ చలికాలంలో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ వెంటనే చేపట్టాలని కోరారు. షాద్‌నగర్ అధ్యక్షుడు నరేష్ రాథోడ్ పాల్గొన్నారు.

### దొంగల బీభత్సం...
### భయం భయంలో పట్టణవాసులు

**కొత్తూర్, నవంబరు 5, ప్రభాతవార్త :** తిమ్మాపూర్‌లో దొంగల బీభత్సం భయంభయంలో పట్టణవాసులు కొత్తూర్‌పురపాలిక పరిధిలోని తిమ్మాపూర్‌లో సోమవారం రాత్రిదొంగలు భీభత్సం సృష్టించారు. పోలీసులు తెలిపినవివరాల ప్రకారం....తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నలగంటి స్వామి ఇంట్లో దొంగలు ఇంట్లో నుండి సుమారుగా 2తులాల బంగారు ఆభరణాలు, 20తులాల వెండి వస్తువులు, కొంతనగదు ఎవరో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి దొంగిలించారన్నారు. బాధితుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు సహించేదిలేదు



వరిధాన్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబరు 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ రైతు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే సహించేదిలేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని డిసిఎంఎస్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధ్యానం కొనుగోళ్లలో ఏలాంటి ఇబ్బందులున్నా వెంటనే తన దృష్టికి తీసుకొనిరావాలని ఆయన రైతులను కొరారు. ఆరుకాలం కష్టపడి పంటను పండించిన రైతును మోసం చేయాలని చూస్తే సహించేదిలేదని అధికారులను హెచ్చరించారు. ఏ గ్రేడ్ వడ్లకు మద్దతు ధర రూ.2320, కామన్ రకాలకు మద్దతు ధర రూ.2300, సన్న వడ్లకు బోనస్‌గారూ. 500 అదనంగా ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. రైతులకు వడ్ల కొనుగోలు విషయంలో ఏలాంటి ఇబ్బందులు కలగకుండ చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. వడ్లకు 17% తేమశాతం లోపు ఉండేల చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఉప్పరిగూడ పిఏసిఎస్ ఛైర్మన్ పాండురంగారెడ్డి, మున్సిపాలిటీ ఛైంర్‌పర్సెన్ కప్పరి స్రవంతిచందు. వైస్ ఛైర్‌పర్సెన్ బర్ల మంగ జగదీష్వర్, డిసి ఎంఎస్ మేనేజర్ వెంకటరమణారెడ్డి, జిల్లా కో-ఆపరుటివ్ అధికారిసుధాకర్,జెడిఎనర్సింహ్మారావు, కాంగ్రెస్‌పార్టీ శ్రేణులున్నారు.

# ఆశాజనకంగా కంది పంట, నిలువున ముంచిన పత్తి పంట

**నవాబుపేట నవంబరు 5, ప్రభాతవార్త:** ఖరీఫ్ పంటల్లో ప్రధానమైన వాణిజ్య పంటపత్తిపంట ఈసారి రైతులు ఆశించిన విధంగా లేకపోవడంతో అన్నదాతలు ఈపంటపై ఆశలు వదులుకున్నారు. మండలవ్యాప్తంగా 21539 ఎకరాల్లో పత్తిపంటను ఈ ఖరీఫ్ పంటగా సాగు చేస్తునట్లు సంబంధిత అధికారులు తెలుపారు. సరైన దిగుబడి వస్తే ఎకరాకు 10 నుండి 14 క్వింటాళ్ళ వస్తే రైతుకు కొంత లాభదాయకంగా ఉండేదని రైతులు అన్నారు. అయితే ఈ సారి దాదాపుగా 4 నుండి 6 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తే గగనమని భావిస్తున్నారు. మొత్తానికి పత్తిపంట నట్టేట ముంచినట్లేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి రావడం అనుమానమేనని నిట్టూరుస్తున్నారు. అయితే ప్రస్తుతం కందిపంట కొంతఆశాజనకంగా ఉన్నదని పూత, కాపుదశలో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.మండలంలో ఈ పంటను 2284 ఎకరాల్లో రైతులు సాగుచేశారు. మొక్కజొన్న 744, వరి 393, జొన్న 15 ఎకరాల్లో ఖరీఫ్ పంటలను రైతులు సాగుచేశారు. అధిక వర్షాల కారణంగానే పత్తి పంట నష్ట పోయినట్లువారు తెలిపారు. రబీ పంటలైనా శనగ, దనియాలు, తదితరపంటలు విత్తేపనులు కొనసాగు తున్నాయని రైతులు అన్నారు. సాగునీటి వసతి ఉన్న రైతులు కూర గాయాలతోపాటు మొక్కజొన్న పంటలను సాగు చేయడానికి సమయాత్త మవుతున్నారని చెప్పారు. అధిక వర్షపాతం నమోదు కావడంతో భూగర్బ జలమట్టాలు పుష్కలంగా ఉన్నాయని నీటివసతి ఉన్న రైతులకు కొంత వెసలు బాటుఉన్నదని వర్షాధారంతో పంటలు సాగుచేసే రైతుల పరిస్థితి దైవాదీనమేనని, రబీపంటలైనా లాభదాయకంగాఉండాలని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



దాతపూర్ రైతు సాగుచేస్తున్న కంది పంట

# కుటుంబ సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలి

**28 గ్రామాలకు 18 మంది సూపర్‌వైజర్లు, 157 మంది ఎన్యూమిరేటర్లు, మండల ఎంపీడీవో, సంధ్య**



మొయినాబాద్ మండలంలో మాట్లాడతున్న మండల అధికారి సంధ్య

**మొయినాబాద్,నవంబరు 05, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల,సర్వే చేయదలచింది,ప్రభుత్వఆదేశాలమేరకు మొయినాబాద్ మండలంలో ఉన్నటువంటి28 గ్రామ పంచాయితీలు, ఆమ్‌లేట్ గ్రామాలతో సహకలుపుకొని సర్వే చేయడం కొరకు ప్రత్యేకంగా అధికారులను నియమించ డం జరిగిదని, మొయినాబాద్ మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు, మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కుటుంబ సర్వే చేయ డానికి నియమితులైన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, సర్వేకు సంబంధించిన విషయాల గూర్చిచర్చించి, ఎవరి బాధ్యతలను వారికి అప్పజెపినట్లు తెలిపారు, సర్వేలో ఉన్నటువంటి ప్రశ్నలకు సమాదనం చెప్పా లని, ప్రజలు అధికారులకు సహకరించాలని వారు ఈ సందర్భంగా మండల ప్రజలను కోరారు, సర్వేకు గ్రామాలకు ఇంటికి అధికారులు వచ్చి నప్పుడు ఇంటిలో అందరు ఉండాల్సిన పనిలేదని, ఇంటియజమాని సహకరించి పూర్తి వివరాలు వెల్లడిస్తే సరిపోతుందన్నారు.

ప్రజలు సర్వేఅధికారులకు సహకరించాలన్నారు, మండలంలో 28 గ్రామాలకు 2011 జనాభ లెక్కల ప్రకారం 12,554 కుటుంబాలుఉండేవి, ప్రస్తుతం ప్రొజెక్ట్‌గా ఎచ్. ఎచ్. ఎల్. ఎస్ 2024 వరకు దాదాపు 20567 కుటుంబాలు8 ఉండొచ్చని అంచానాలు, బుధవారం 6.2024 నుండి కుటుంబాల గుర్తింపు జరప బడుతున్న దని, మండలంలో సర్వేకోసం 157 మంది ఎన్యూమిరేటర్లు, 18 మంది సూపర్‌వైజర్లను డిప్యూటి చేయడం జరిగిందని తెలిపారు, డిప్యూటి తహసీల్దార్ వినోద్‌కుమార్, కిషన్‌రావు, మండల స్పెషల్ ఆఫీసర్, ఎం.ఈ.వో, వెంకయ్య, రవిందర్‌మాస్టర్ ట్రైనర్, పాల్గొన్నారు ఎంపీవో శ్రీనివాస్, సూపరిండెంట్ శారద ఉన్నారు.

### సమగ్ర సర్వేకు సహకరించాలి : ఎంపిడివొ అపర్ణ



షాబాద్ మండలంలో మాట్లాడుతున్న షాబాద్ ఎంపీడీవో అపర్ణ

**షాబాద్,నవంబరు5, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. షాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి సమగ్రసర్వేకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... అక్టోబర్ 28న సమగ్ర సర్వేకుసంబంధించిన శిక్షణను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు ఇచ్చినట్టు తెలిపారు. సాంఘిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కులతదితర అంశాలకు సంబంధించి సంపూర్ణ వివరాలు సేకరిస్తా మన్నారు. మండలాన్ని 155 బ్లాక్‌లుగా విభజించి, 130మంది ఎన్యు మనే టర్లను నియమించినట్లు తెలిపారు. ఒక్కోఎన్యుమనేటర్150 కుటుంబాల పూర్తి వివరాలు సేకరిస్తారన్నారు. ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు 35మంది అంగన్‌వాడీ టీచర్లు 13మంది, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు 65, ఆశా వర్కర్లు ఇద్దరు, వీఏవోలు 10మంది, ఉపాధి హామీ పీల్డ్ అసి స్టెంట్లు ఇద్దరు, సీఆర్పీలు ముగ్గురు పాల్గొంటున్నట్లు తెలిపారు. 6వ తేది నుండి 18వ తేదీ వరకు ఎన్యుమలేటర్లకు కేటాయించిన గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారని తెలిపారు. సేకరించిన వివరాలను ఈనెల 19వ తేది నుండి 27వరకు డేటా ఎంట్రీ చేస్తామన్నారు. వచ్చిన పూర్తి సమాచారాన్ని డేటా ఎంట్రీ పూర్తయిన తర్వాత 30వ తేదీలోపు సబ్మిట్ చేయనున్నట్టు తెలిపారు.పజలు సమగ్ర సర్వే సిబ్బందికి తమ కుటుంబ పూర్తి వివరాలను అందజేసి సహకరించాలని కోరారు.

### కుల గణన సర్వేతో సమాజంలో మార్పు

**ప్రభుత్వరంగ సంస్థల ఛైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కులగణన సదస్సుకు తరలివెళ్తున్న నాయకులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 05 :** కుల గణన సర్వేతో సమజంలో మార్పుతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వరంగసంస్థల ఛైర్మన్,ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. మంగళవారం కుల గణనపై మేధావులు, పౌరహక్కుల నేతలు, విద్యార్థి, కుల సంఘాల నేతలతో కలిసి సమగ్ర కులగణన సదస్సు సమావేశంలో పాల్గొనడానికి షాద్‌నగర్ ప్రాంతంనుండి 200 వాహనాలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సంక్షేమఫలాలతో పాటు రాజకీయంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ,తదితర అంశాల్లో వాటా లభిస్తుందని వివరించారు. రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు సమగ్ర కుల గణన ద్వారా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో భాగంగా కులగణన చేసి ఇంటింటికి వెళ్లి సర్వేఅంశాలను ప్రజలకు వివరి స్తామన్నారు. రాహుల్‌గాంధీ కుల గణనపై మేధావుల సూచనలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య, మహ్మద్ అలీఖాన్ బాబర్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రఘు, రాజు, వీరేష్, పురుషోత్తం రెడ్డి, జగదీశ్వరప్ప, నరసింహ్మా రెడ్డి, ఎర్రోళ్ల జగన్, కొత్తపేట ఉస్మాన్, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# మత్స్యకారులకు సబ్సిడీతో చేపపిల్లల పంపిణీ



కాకరవాణి ప్రాజెక్టులో చేపపిల్లలను వదుతున్న తిరుపతిరెడ్డి

**బొంరాస్‌పేట్,నవంబరు5,ప్రభాతవార్త ః** వికారాబాద్ జిల్లా మత్స్యశాఖ అధ్వర్యంలో బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమళ్ల గ్రామంలోని కాకరవాణి ప్రాజెక్టులో వందశాతం సబ్సిడీతో ప్రభుత్వం చేపపిల్లలకు పంపిణీ చేయడంతో వాటిని కొడంగల్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ తిరుపతిరెడ్డి,కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో మంగళవారం ప్రాజెక్టులోచేపపిల్లలను వదలడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం మత్స్యకారులకు వందశాతం సబ్సిడీతో ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేయడం జరిగిందని చేపపిల్లల పంపిణీతో మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని అన్నారు. ప్రభుత్వం చేపపిల్లల పంపిణీతో మత్స్యకారులకు జీవనోపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనేది రాష్ట్రప్రభుత్వం ఆలోచన అన్నారు. ప్రభుత్వం అందించిన చేపపిల్లలను మత్స్యకారులు చెరువులలో పెంచి వాటి ద్వార ఉపాధి పొందాలని అన్నారు.కాకరవాణి ప్రాజెక్టులో 1లక్ష 13వేల 6వందల చేపపిల్లలను వదలడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య,డిఎఫ్‌సిఎస్ అధ్యక్షులు శ్రీధర్,జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేష్‌రెడ్డి,పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు అంజిల్‌రెడ్డి,పార్టీ అధ్యక్షులు నర్సిములుగౌడ్,పిఏసీఎస్ ఛైర్మన్ జయకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకట్‌రాములుగౌడ్,మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబయ్యగౌడ్, ఎంపిడిఓ వెంకన్నగౌడ్, దేశ్యానాయక్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రాంరెడ్డి, వెంకటయ్య, మల్లేష్, కిష్టప్ప, సంతోష్‌నాయక్, రాములు పాల్గొన్నారు.

### రాహుల్‌గాంధీ సభకు భారీగా తరలివెళ్ళిన నాయకులు



మండలకేంద్రానికి చేరుకున్న నాయకులు కార్యక్తలు

**నవాబుపేట,నవంబరు 5,ప్రభాతవార్త:** సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించడానికి నగరానికి వస్తున్న అధినేత రాహుల్‌గాంధీ సభకు మండలం నుండి అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల నుండి మండల కేంద్రానికి చేరుకున్న నేపథ్యంలో వాహనాల కాన్వాయిని పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, అధికార ప్రతినిధి సామ వెంకట్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

### మాజీ ఎమ్మెల్యేతో కలిసి ఛైర్మన్ మార్నింగ్ వాక్



అభివృద్ధిపనులపైమాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డితో కలిసి సమాలోచన చేస్తున్న ఛైర్మన్ కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 5, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని ప్రతాప సింగారంలో చేపట్టదలిచిన పలు అభివృద్ధి పనులను మాజీఎమ్మెల్యేఎం.సుధీర్‌రెడ్డితో కలిసి ఛైర్మన్ బి. కొండల్ రెడ్డి సమీక్షించారు. మంగళవారం మార్నింగ్‌వాక్‌లో భాగంగా ఛైర్మన్ ప్రతాప సింగారంలో మాజీ ఎమ్మెల్యేతో కలిసిపర్యటించారు. మాజీ ఎమ్మెల్యే సూచనల మేరకు పారిశుద్ధ్యపనులతో పాటు గోడలపై పచ్చదనంతో కూడిన చిత్రాలను వేయించాలని సూచించారు. గ్రామంలోని ప్రధాన జంక్షన్‌ను సుందరీకరణపనులుచేపట్టాలనికోరారు.తేజశ్రీకాలనీలో దోజంతో రోడ్డుకు ఇరువైపులా గల పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తా మని ఛైర్మన్ అన్నారు. ఛైర్మన్‌తోపాటు నాయకులు ప్రభాకర్ గౌడ్, బద్దం కుమార్, జుబేదాబేగం, నత్తికృష్ణ, జోగు మల్లేశ్, రమణా రెడ్డి, దశరథ్, శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### మర్పల్లిలో పశువుల సంత పున: ప్రారంభం



మర్పల్లిలో పశువుల సంతను ప్రారంభిస్తున్న నాయకులు

**మర్పల్లి నవంబరు 05,ప్రభాతవార్త:** మర్పల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పశువుల సంతను మంగళవారం నాడుపున: ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ మహెందర్ రెడ్డి,వైస్ ఛైర్మన్ మల్లేష్ యాదవ్,కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గుడేంరాములు యాదవ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కోన్ని సంవత్సరాలుగా పశువులసంత లేక పోవడంతో పశు పెంపకదారులు,రైతులు చాల ఇబ్బందలు పడ్డారన్నారు. ఈ సంతను మర్పల్లి, బంట్వారం.మోమిన్‌పేట్ మండలల రైతులు పయోగించుకోవాలని, కాంగ్రేస్ ప్రభుత్వం రైతుల అభివృద్ది ద్యేయంగా ముందుకు సాగుతుందని వారు అన్నారు.అన్నదాతలందరికి గిట్టు బాటు ధర కల్పిస్తాం అన్నారు. యార్కెట్ కమిటి డైరెక్టర్‌లు మోమిన్ పెట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్,రాచన్న,పర్వేద శ్రీను,భరత్ తదితరులు పాల్గొన్నారు.

### పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

**షాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త :** రైతులు పశువులకు ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని షాబాద్,రేగడిదోస్వాడ పశువైద్యులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని సంకేపల్లిగూడ, లింగారెడ్డిగూడ తదితర గ్రామాల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకోసం ముందస్తుగా టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించి, ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

### మైసిగండి మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు



అమ్మవారి ఆలయ హుండీ లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

**కడ్తాల్,నవంబరు 05 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ టి.శేఖర్, ఆలయ ఫౌండర్ ట్రస్టు ఛైర్మన్ సిరోలి పంతునాయక్, ఈఓ స్నేహలత ఆధ్వర్యంలో 60 రోజుల హుండీ లెక్కింపులో భాగంగా రూ.894822 ఎనిమిది లక్షల తొంభై నాలుగు వేల ఎనిమిది వందల ఇరవై రెండు రూపాయలు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉప అర్చకులు మాదారం యాదగిరి, ఆర్పీ భాస్కర్, వి.అరుణ్, సిబ్బంది పి.కృష్ణ, బి.చంద్రయ్య, జి.రాములు, ఇ.శ్రీనివాస్, వి. ఆనంద్,జె.సంతోష్‌కుమార్, కెనరా బ్యాంక్ సిబ్బంది, పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులుపాల్గొన్నారు.

**అంగన్‌వాడీ ఆయాలకు చీరల పంపిణీ**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 05 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అంగన్‌వాడీ ఆయాలకు చీరలను పంపిణీ చేశారు. సీడీపీవో నాగమణి పదవీ విరమణ సందర్భంగా అంగన్‌వాడీ ఆయాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు రఘు నాయక్, అగ్గనూరు బసవేశ్వర్, మహ్మద్ అలీఖాన్ బాబర్, ఇబ్రహీం, అన్వర్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.